కులగణన ప్రారంభం



గార: అంపోలులో కులగణన సర్వే ప్రారంభిస్తున్న ఎంపీపీ రఘురాం, సిబ్బంది

గార: కుల గణనకు ప్రజలు సహకరించాలని గార ఎంపీపీ గొండు రఘురామ్ కోరారు. శుక్రవారం అంపోలు పంచాయతీలో చేపట్టిన కులగణన ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. బయోమెట్రిక్ ద్వారా జరుగుతున్న ఈ సర్వే పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో సర్వే చాలా కీలకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీడీఓ సంజీవి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు గ్రామంలో శుక్రవారం కులగణన కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎస్.వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదేల చెంగల్వరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం కుల గణన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండలంలోని యర్రవరం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం కులగణన సర్వేను ఇంటింటికి వెళ్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన తరువాత ప్రజల జీవన ప్రమాణాల స్థితిగతులు చక్కగా తెలుస్తాయన్నారు. కులగణనకు సంబంధించి ప్రత్యేక యాప్‌లో కులగణన వివరాలు నమోదు అవుతాయన్నారు. కులాలు, ఉప కులాల వంటి వివరాలను సిబ్బంది పక్కాగా నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు, మింది శ్రీనివాస్, బిక్కవోలు వెంకటరమణ, అయ్యప్ప రమణ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

జి.సిగడాం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో కులగణన సర్వే ప్రారంభమైంది. ఎస్.పి.ఆర్.పురం గ్రామంలో నోడల్ అధికారి కూనిబిల్లి కోటిబాబు సమక్షంలో సర్వే చేపట్టారు. స్థానిక సర్పంచ్ కంది రమాదేవి, వీఆర్వో సీతయ్య, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఉన్నారు



శ్రీకాకుళం రూరల్: రాగోలులో కులగణన చేస్తున్న సిబ్బంది

సమర్థవంతంగా సర్వే

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కులగణన నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నోడల్ అధికారులు, కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమన్వయంతో కులగణన చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆర్థిక, సామాజిక, విద్య, జీవనోఉపాధిపై సర్వే చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో కె.నిశ్చెల, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.



రణస్థలం: యర్రవరంలో సర్వేలో పాల్గొన్న సాయికుమార్



జి.సిగడాం: ఎస్.పి.ఆర్.పురంలో సర్వే చేస్తున్న సిబ్బంది



జి.సిగడాం: మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాలరావు

క్లుప్తంగా

సంతోషిమాతకు విశేష పూజలు



అమ్మవారికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి హారతులిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఓటు వేయడంపై అవగాహన



ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు తమ అమూల్యమైన ఓటును ఎలా వేయాలో గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎం, వీవీప్యాట్‌లను శుక్రవారం ప్రదర్శించి వాటి పనితీరు, ఓటు వేయడం ఎలా అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌వోలు ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, పాశపు ముకుంధ, సుంకరి రమణ ఉన్నారు.

వీసీ రజనికి అభినందనలు



వీసీ రజనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చక్రవర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి వైస్ చాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ కె.ఆర్.రజనిని శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కె.శివశంకర్, ఎస్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు కౌన్సిలింగ్

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం తాగి న్యూసెన్సు చేసిన ఇద్దరు యువకులను స్టేషన్‌కు పిలిపించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. గురువారం రాత్రి 9:35 గంటల ప్రాంతంలో జి.సోమేష్ అనే యువకుడు, అతని మేనల్లుడు మద్యం సేవించి వచ్చే పోయే వాహనదారులను ఆపుతూ ఇబ్బందులకు గురిచేసినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించామన్నారు. వీరిద్దరినీ పిలిచి తల్లిదండ్రుల సమక్షంలో మందలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు సేవలు అందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్‌కు వచ్చిన ప్రతి మహిళ సమస్య విని పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ న్యాయవాది మోహనరావు, ఏఎస్ఐ రేణుకా రాణి, సిబ్బంది హిమబిందు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



పూజలందుకుంటున్న విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గా దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు



క్రీడాకారులతో ఎంపీపీ, అధికారులు, నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలస్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఎచ్చెర్ల మండలానికి సంబంధించి క్రికెట్, కబడ్డీ విభాగాల్లో శుక్రవారంతో ముగిశాయి. పోటీలను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ప్రారంభించారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో ఫైనల్‌కు చేరిన చిలకపాలెం, సంతసీతారాంపురం జట్లు తలపడగా.. చిలకపాలెం జట్టు విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో కబడ్డీలో ఫైనల్ పోటీలు జరగ్గా.. ఎచ్చెర్ల జట్టుపై చిలకపాలెం జట్టుపై విజయం సాధించి నియోజకవర్గ పోటీలకు ఎంపికైంది. విజేత జట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ ఫైనల్ పోటీలు నిర్వహణకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో నియోజకవర్గస్థాయి పోటీలు జరగనున్నాయి.

ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యం



రణస్థలం: వైద్య శిబిరంలో పాల్గొన్న సాయికుమార్

రణస్థలం: ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. యర్రవరం గ్రామ సచివాలయ పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలకు గ్రామాల్లో విశేషమైన స్పందన వస్తోందన్నారు. గ్రామాల్లోకే వైద్యులు వచ్చిన ఆరోగ్య పరీక్షలు చేయడం వలన వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు, మింది శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



పెరటి కోళ్లు అందజేస్తున్న ఎంపీపీ రఘురామ్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

గార: పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం లభిస్తుందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శుక్రవారం తూలుగు పంచాయతీలో డ్వాక్రా సంఘ సభ్యులకు పెరటి కోళ్ల యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దనే కోళ్లను పెంచుకోవడం ద్వారా కుటుంబ సభ్యులు పోషకారంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వం రాయితీపై యూనిట్లు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఎంపీడీవో సంజీవి రమణయ్య, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణ, కొయ్యాన నాగభూషణం, కొయ్యాన చిన్నంనాయుడు, గంగు రామారావు, యాళ్ల నారాయణమూర్తి, శిమ్మ ధర్మరాజు, ముద్దాడ గోవిందరావు, ఏపీఎం భాగ్యలత పాల్గొన్నారు.

బీసీల జాబితాలో చేర్పించాలని వినతి



ఎచ్చెర్ల: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: తమను బీసీల జాబితాలో చేర్పించాలని లావేరు మండల తెలగ కులస్తుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం లావేరు తహసీల్దార్ సాధు దిలీప్‌చక్రవర్తిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు తోటయ్యదొర, వైఎస్సార్‌సీపీ నాయకుడు రొక్కం బాలకృష్ణలు మాట్లాడుతూ.. మండలంలో 25 వేల మంది తెలగ కులస్తులు ఉండగా.. వీరంతా రాజకీయంగా, సామాజికంగా చాలా వెనుకబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దాశెట్టి తిరుపతిరావు, ఎల్.శ్రీనివాసరావు, నాగం కనకరాజు, శ్రీను, మల్లేశ్వరరావు, మురళీ, రామదాసు, నరేష్, రాంబాబు ఉన్నారు.

రణస్థలం: తమకు బీసీ రిజర్వేషన్ కల్పించే విధంగా తగు న్యాయం చేయాలని కోరుతూ తెలగ కుల సంఘ నాయకులు మండల రెవెన్యూ సూపరింటెండెంట్ బి.సత్యవతికి వినతి పత్రం అందజేశారు. రణస్థలం కుల పెద్దలు రాయపురెడ్డి భుజంగరావు, లంకలపల్లి ప్రసాద్, సుంకరి రమణ ఉన్నారు.

జి.సిగడాం: తెలగ కులస్తులను బీసీల జాబితాలో చేర్చేవరకు ఐక్యమత్యంతో పోరాటాలు చేయాలని మండల నాయకులు కాయల రమణ, పిల్లల శివకుమార్, బత్తుల సన్యాసిరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావుకు వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు బత్తుల వెంకటకృష్ణారావు, డి.ధర్మారావు, బాలబొమ్మ వెంకటేష్, చందనాల రంగారావు, మానం సత్యరావు, విక్రం కోటి పాల్గొన్నారు.

రాజేష్‌కు సత్కారం



రాజేష్‌ను సన్మానిస్తున్న ఆర్.కృష్ణయ్య

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సన్మానం చేశారు. ఇటీవల జేఎన్‌టీయూజీవీలో సిండికేట్ మెంబర్‌గా నియమితులైనందున రాజేష్ శుక్రవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించే గొప్ప నాయకుడు రాజేష్ అని కొనియాడారు.

22న లావేరులో శోభాయాత్ర



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: అయోధ్యలో ఈనెల 22వ తేదీన చేపట్టనున్న శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా అదే రోజున లావేరులో శోభాయాత్రను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రాలనుకమిటీ సభ్యులు చిన్నమురపాక, పెదరొంపివలస, కేశవరాయునిపాలెం, లోపెంట గ్రామాల్లో శుక్రవారం పర్యటించి భక్తులకు అందజేశారు. యాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీహెచ్‌బీ కాలనీలో కుక్కల బెడద



కాలనీలో కుక్కల గుంపు

అరసవల్లి: జిల్లాపరిషత్ ఎదురుగా ఉన్న ఏపీహెచ్‌బీ కాలనీలో కుక్కల బెడద వేధిస్తోంది. కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఈ కాలనీలో వందకు పైగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. జెడ్పీ కాలనీ, కార్గిల్‌పార్క్, అంబేడ్కర్ భవన్ రోడ్డులపై వెళ్లే వాహనచోదకులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవలే ఇద్దరు చిన్నారులపై దాడి చేశాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి కుక్కల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

22న శ్రీరామ క్రతువు నిర్వహణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 22న అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రతిష్ట సందర్భంగా శ్రీకాకుళం నగరంలో అనంత భారతి ఆర్షవిజ్ఞాన వాటిక ఆధ్వర్యంలో శ్రీరామ క్రతువు నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ విఠలేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వాహకులతో కలసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మొత్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. ఆర్షవిజ్ఞాన వాటిక నిర్వాహకుడు భాస్కరభట్ల శ్రీరామశర్మ మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని, ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యోగా రామారావు, తంగి స్వాతి, నటుకుల మోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ఈ నెల 22న విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు, ఈఓ గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విష్ణు సహస్రనామ పారాయణ, సంక్షిప్త రామాయణ పారాయణం, రామరక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా, సువర్ణ పుష్ప అర్చనలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సమన్వయం అవసరం



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

జి.సిగడాం: గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాటలో నడవాలంటే క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కె.నిశ్చెల అన్నారు. తన కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి పల్లె అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసాల వెంకటరమణ, కాయల రమణ పాల్గొన్నారు.

స్టేషన్‌మాస్టర్‌కు సన్మానం



స్టేషన్ మాస్టర్ రవికుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏఎస్పీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్ :

ఈస్ట్‌కోస్ట్ రైల్వేజోన్‌లో 2022–23 సంవత్సరానికి గాను బెస్ట్ క్లీన్ రైల్వే స్టేషన్‌గా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఎంపికయ్యేందుకు కృషి చేసిన స్టేషన్ మాస్టర్ మొదలవలస రవికుమార్‌ను జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు సన్మానించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని అతని చాంబరులో శ్రీకాకుళం సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రవికుమార్‌ను పిలిపించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడం, ప్రజలను, అభివృద్ధి కమిటీని, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ స్టేషన్ అభివృద్ధి చేయడంలో రవికుమార్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.రవికుమార్, మెంటార్ ఎస్.మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.దేవభూషణరావు, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మిస్రో, సెక్రటరీ రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



శ్రీకాకుళం న్యూకాలనీ:ఉత్సాహంగా సాగుతున్న ఫైనల్ క్రికెట్ మ్యాచ్



శ్రీకాకుళం న్యూకాలనీ: క్రికెట్ పోటీలను తిలకిస్తున్న ఆర్డీవో రంగయ్య, తదితరులు



గార:విజేతగా నిలిచిన బందరువానిపేట క్రికెట్ జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. శ్రీకాకుళం అర్బన్ మండల పరిధిలో ఇప్పటికే వాలీబాల్, కబడ్డీ, ఖోఖో బాడ్మింటన్ పోటీలు ముగిశాయి. క్రికెట్ పోటీలు మాత్రం శుక్రవారంతో ముగిశాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శ్రీకాకుళం అర్బన్ పరిధిలోని గుడివీధి, కలెక్టర్ బంగ్లా రోడ్ సచివాలయాలు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. గుడివీధి 7 వికెట్ల తేడాతో గెలిచింది. శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, పీఈటీ సంఘ నాయకులు ఎం.సాంబమూర్తి, పీడీలు ఎం.ఆనంద్‌కిరణ్, పురుషోత్తం, లోపంటి ఢిల్లేశ్వరరావు, ఆర్.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గార: మండలంలో జరుగుతున్న ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన క్రికెట్ ఫైనల్‌లో బందరువానిపేట జట్టు విజేతగా నిలిచింది. కె.మత్స్యలేశం పంచాయతీలో జరిగిన ఈ పోటీలను స్థానిక సర్పంచ్ బి.లలిత ప్రారంభించారు. అదేవిధంగా సాందీపని విద్యాలయంలో జరిగిన శ్రీకూర్మం–1, శ్రీకూర్మం–2ల మధ్య జరిగిన కబడ్డీ ఫైనల్‌లో శ్రీకూర్మం–1 జట్టు విజేతగా నిలిచింది. ఖోఖో పోటీల్లో మహిళల విభాగంలో అంపోలు–3, పురుషుల విభాగంలో శ్రీకూర్మం–4 విజేతలుగా నిలిచారు. వీరిని ఎంపీడీవో సంజీవి రమణయ్య అభినందించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ ఆవరణలో ఈ నెల 26న ఉదయం 8.45 గంటలకు గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. న్యాయవాదులంతా హాజరుకావాలన్నారు.